క్లుప్తంగా

30న మినీ బాలోత్సవం



మినీ బాలోత్సవం కరపత్రం, ఫ్లెక్సీ విడుదల చేసిన నిర్వాహకులు

ఏలూరు (టూటౌన్): స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఈ నెల 30న సాయంత్రం 4 గంటలకు మినీ బాలోత్సవం నిర్వహించనున్నట్టు ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి వీజీఎంవీఆర్ కృష్ణారావు తెలిపారు. స్థానిక పవరుపేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో శనివారం దీనికి సంబంధించిన కరపత్రం, ఫ్లెక్సీని విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ హేలాపురి బాలోత్సవం, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఏలూరు పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న 10 హేలాపురి ఆలోచన ట్యూషన్ సెంటర్ల విద్యార్థులకు 12 రకాల అకాడమిక్ కల్చరల్, క్రీడా అంశాల్లో పోటీలు నిర్వహించి 30న నిర్వహించే వార్షికోత్సవ కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో గుడిపాటి నరసింహారావు, ఎం లక్ష్మి, పి.సూర్యప్రకాష్, ఎం మిల్టన్, బి.అంకిత జైన్, ఎస్ వెన్నెల దేవి, ఎం లహరి, ఎం సిద్ధార్థ సాయి పాల్గొన్నారు.

ప్రీ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే



ప్రీ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డేలో పట్టాలను చూపుతున్న విద్యార్థులు

ఏలూరు (టూటౌన్): కాన్వెంట్లకు పోటీగా అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ స్కూల్స్ నిలవాలని ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ ఎ.పద్మావతి పిలుపు నిచ్చారు. స్థానిక ఫిరంగుల దిబ్బ ప్రాంతంలోని నవయుగ మున్సిపల్ స్కూల్ ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శనివారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ప్రీ ప్రైమరీ వర్క్‌బుక్స్, బోధన పరికరాలు ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఐదేళ్లు పూర్తయిన 13 మంది పిల్లలకు ప్రీ స్కూల్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏలూరు–2 సెక్టార్ సూపర్ వైజర్ ఎం మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎం నవతి, కె.ఝాన్సీలక్ష్మి, షామియా, డి.నాగదేవి, ఓఎస్‌డీ భవాని, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 29 కిలోల గంజాయి పట్టివేత




స్వాధీనం చేసుకున్న గంజాయితో రైల్వే పోలీసులు

ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు జీఆర్‌పీ సీఐ పీ.శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ సీఐ బీ.శంకరరావు చెప్పారు. విజయవాడ రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు విజయవాడ రైల్వే డీఎస్పీ డీవీఎస్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో శనివారం తనిఖీలు చేశారు. రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ నంబర్–3లో బ్యాగులను తనిఖీ చేస్తుండగా భారీగా గంజాయిని గుర్తించారు. కేరళ రాష్ట్రం పాలక్కడ్ జిల్లా ప్రాంతానికి చెందిన షాఫిర్ సైపుద్దీన్, మహారాష్ట్ర షోలాపూర్ ప్రాంతానికి చెందిన శశికళ రమేష్ లకండే అనే ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 29 కిలోల 300 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

సొంతింటి కల.. నెరవేరిన వేళ

- ఊళ్లుగా మారుతున్న కాలనీలు
- ఏలూరులో 29,985 మందికి ఇళ్ల స్థల పట్టాలు
- కొమడవోలు, పోణంగి, చొదిమెళ్లలో కాలనీలు



పోణంగి జగనన్న ప్రధాన లేఅవుట్‌లో ఇంటి నిర్మాణాలు



కొమడవోలు జగనన్న కాలనీలో నిర్మించిన ఇల్లు



పోణంగి జగనన్న కాలనీలో రెండు అంతస్తుల్లో ఇంటి నిర్మాణం



పోణంగి జగనన్న లేఅవుట్‌లో నిర్మిస్తున్న ఇళ్లు



కొమడవోలు జగనన్న కాలనీలో సూర్యనారాయణ ఇల్లు

ఏలూరు టౌన్: సెంటు భూమి ఉంటే చాలు సొంతిల్లు కట్టుకోవాలనేది సగటు మనిషి జీవితాశయం. రోజంతా కష్టపడి పనిచేసుకుంటూ రాత్రయ్యేసరికి గూటికి చేరుకుని హాయిగా నిద్రపోవాలని ప్రతి వ్యక్తీ కల కంటాడు. కానీ కుటుంబం, పిల్లలను సాకుతూ సగం జీవితం పూర్తైన తర్వాత వెనక్కి తిరిగి చూస్తే శూన్యం కనిపిస్తుంది. అద్దె ఇళ్లలోనే మగ్గుతూ బతుకు జీవుడా అంటూ కాలం వెళ్లదీసే పేదలకు సొంతింటి కలను సాకారం చేసి చూపించింది వైఎస్సార్ సీపీ సర్కారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రతి పేదవాడికీ సొంతిల్లు ఉండాలనే దృఢ నిశ్చయంతో ఎమ్మెల్యే ఆళ్ల నాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి భారీగా ఇళ్ల స్థలాలు మంజూరు చేశారు. 29,985 మంది అక్కాచెల్లెమ్మలకు ఇంటి స్థల పట్టాలను అందజేశారు. ప్రతి ఒక్కరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలనే ఆశయంతో పనిచేస్తున్నారు.

29,985 మందికి ఇళ్లు

ఏలూరు నియోజకవర్గం పరిధిలో వైఎస్సార్ జగనన్న ఇళ్ల కాలనీలకు సంబంధించి మూడు చోట్ల భారీ లేఅవుట్లు ఉండగా, మరో రెండు మూడు చిన్న లేఅవుట్లు ఉన్నాయి. ముఖ్యంగా కొమడవోలు, పోణంగి, చొదిమెళ్ల జగనన్న కాలనీలు పెద్ద ఊర్లుగా మారబోతున్నాయి. కొమడవోలు లేఅవుట్‌లో 9,980 మందికి, పోణంగి లేఅవుట్‌లో 9,976 మందికి, చొదిమెళ్ల లేఅవుట్‌లో 7,017 మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఈ మూడు కాలనీల్లో స్థలాలను పూర్తిస్థాయిలో మెరక చేసి, రోడ్లు నిర్మించారు. విద్యుత్ సౌకర్యం కల్పించారు. ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. శనివారపుపేట, సత్రంపాడులోనూ, పోణంగి, కొమడవోలులోనూ చిన్నచిన్న లేఅవుట్లు ఏర్పాటు చేసి 3,013 మందికి ఇంటి పట్టాలు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

ఏలూరు నియోజకవర్గానికి సంబంధించి సుమారు 539 ఎకరాలను జగనన్న ఇళ్ల కాలనీలకు ప్రభుత్వం సేకరించింది. కొంత ప్రభుత్వ భూమి ఉండగా, అధికభాగం ప్రైవేటు భూములు కొనుగోలు చేసి పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ చేశారు. ఏలూరు నగరంలో 90,249 కుటుంబాలు ఉండగా, వీటిలో సుమారు 30 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందజేయటం విశేషం. జగనన్న ఇళ్ల లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కొమడవోలు జగనన్న లేఅవుట్‌లో సొంతంగా లబ్ధిదారులు ఇళ్లను సుందరంగా నిర్మించుకుంటున్నారు. పోణంగిలోని ప్రధాన లేఅవుట్‌లో ప్రభుత్వమే పేదలకు ఇళ్లు నిర్మిస్తోంది.

సొంతిల్లు నిర్మించుకున్నాం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాకు ఇంటి స్థలం మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి కొంత ఆర్థిక సాయం అందించింది. మిగిలిన సొమ్ము సమకూర్చుకుని ఇల్లు నిర్మించుకున్నాను. ఆరు నెలలుగా నివాసం ఉంటున్నారు. విద్యుత్, రోడ్లు, తాగునీటి సౌకర్యం ఉంది. వాటర్ ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్నారు.

– గంధవరపు శివదుర్గ, కొమడవోలు జగనన్న కాలనీ

స్థలం మంజూరైంది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు మేలు జరిగింది. మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలు అందిస్తుండగా, ఇంటి స్థలం మా పేరుతోనే రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వటం ఆనందంగా ఉంది. ఇంటి నిర్మాణం చేసుకోవటం ద్వారా కుటుంబంతో సొంతింటిలో నివసించే అవకాశం ఉంటుంది.

– జి.హైమావతి, వెంకటాపురం పంచాయతీ, లబ్ధిదారు

స్థలం రిజిస్ట్రేషన్ చేశారు



సొంతిల్లు ఉండాలనే కోరికను నెరవేర్చటంతోపాటు గతంలో మాదిరిగా కాకుండా పూర్తి హక్కులతో రిజిస్ట్రేషన్ చేయించి మరీ ఇంటి స్థలం పట్టాలు ఇవ్వటం సంతోషంగా ఉంది. ఏలూరు నియోజకవర్గంలో ఎంతోమంది పేదలకు ఇంటి స్థలం ఇచ్చారు. ప్రభుత్వమే ఇల్లు నిర్మాణం చేసుకునేందుకు రూ.1.80 లక్షలు ఇస్తోంది.

– డి.శ్యామల, ఏలూరు రూరల్, లబ్ధిదారు

సంక్షేమ మేనిఫెస్టో

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పూర్తిగా సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని నాయకులు పేర్కొంటున్నారు.

సీఎం వైఎస్ జగన్ మాట నిలబెట్టుకుంటారు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారు. ఎన్ని కష్టాలు వచ్చినా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేస్తారు. వైఎస్సార్ చేయూత పథకం మొత్తం రూ.75 వేల నుంచి రూ.1 లక్షా 50 వేలకు పెంచడం అద్భుతం. 45 ఏళ్లు పైబడిన మహిళలకు ఈ పథకం ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పేద కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయి. ఇప్పటికే ఈ పథకం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ఏటా లక్షలాది మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.కోట్లు జమ చేస్తున్నారు.

– పెన్మెత్స శ్రీనివాసరాజు, ఏలూరు ఎంపీపీ

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు



చంద్రబాబు హామీలన్నీ బట్టదాఖలే. ఎన్నికల్లో గెలుపుకోసం హామీలు గుప్పిస్తారు. గెలిచిన తర్వాత అమలు చేయరు. గతంలో ఇదే విధంగా హామీలు ఇచ్చి గెలిచి, ప్రజలను మోసం చేశారు. రాష్ట్ర ప్రజలు చంద్రబాబు హామీలను నమ్మరు. ఇచ్చిన మాటకు జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉంటారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేస్తారు. ఓబీసీ, వైఎస్సార్ కాపు నేస్తం పథకం లబ్ధి రూ.60 వేలు నుంచి రూ.1 లక్ష 20 వేలకు పెంచడం సంతోషంగా ఉంది. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోపై ప్రజలకు నమ్మకం ఉంది.

– ముంగర సంజీవ్‌కుమార్, వడ్డి కార్పొరేషన్ చైర్మన్

నేడు పాడనా తీయగా సినీ సంగీత లహరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఎస్‌పీఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 28న పాడనా తీయగా పేరిట సినీ సంగీత లహరి కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ వ్యవస్థాపకుడు ఎస్‌పీఎస్ వాసు ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో ఆదివారం సాయంత్రం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభమౌతుందని, వివిధ టీవీ సంగీత పోటీల విజేతలు రసూల్ బాబు, సుధారాణిలతో పాటు స్థానిక గాయనీ గాయకులు, ఎస్‌పీఎస్ బెస్ట్ సింగర్స్ సీజన్–1, –2 సిరీస్‌ల విజేతలు పాల్గొని విజయవంతమైన గీతాలను ఆలపిస్తారని పేర్కొన్నారు. గాయకులకు ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ ట్రూప్‌లోని సంగీత వాద్యకారులు వాద్య సహకారమందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నగరంలోని సంగీత అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రాజరాజేశ్వరి అలంకరణలో రాట్నాలమ్మ



రాజరాజేశ్వరి అలంకరణలో రాట్నాలమ్మ దర్శనం

పెదవేగి: రాట్నాల కుంటలో గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరాట్నాలమ్మ తిరునాళ్లు శనివారం ముగిశాయి. ఆఖరి రోజు అమ్మవారు శ్రీరాజరాజేశ్వరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరునాళ్లలో భాగంగా విఘ్నేశ్వరపూజ, నవగ్రహ మండపార్చన, పరిసర దేవాతార్చన, కుంకుమార్చనలు, శ్రీరామలింగేశ్వర స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేశారు. అనంతరం మహానివేదన, దీక్షావిరమణ, ఆశీర్వచనం అందించారు. రాయన్నపాలెంకు చెందిన హరే శ్రీనివాస కోలాట భజన సమాజం కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలకు పూలరంగడు సాంఘిక పద్యనాటకం భక్తులను అలరించింది.

సంక్షేమ పాలనకు ఓటేయండి



22వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు



35వ డివిజన్‌లో బ్రోచర్ అందిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాసరావు



37వ డివిజన్‌లో జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎన్‌వీ శివరావు ప్రచారం

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ఫ్యాన్ స్పీడుగా తిరుగుతోంది. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని ప్రతి ప్రాంతంలోనూ వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. జగన్ సర్కారు అధికారం చేపట్టిన 58 నెలల కాలంలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లేయాలని అభ్యర్థిస్తున్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆళ్ల నాని, కారుమూరి సునీల్‌కుమార్‌కు మద్దతుగా నిలవాలని ప్రజలను కోరుతున్నారు. ఏలూరు 22వ డివిజన్‌లో నగర డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

ఏలూరులో జోరుగా ఎన్నికల ప్రచారం

- 35వ డివిజన్‌లో నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడపగడపలోనూ జరిగిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే నానిని మరోసారి గెలిపించటం ద్వారా మరింత సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కాగని అచ్చిబాబు, గేదెల సూర్యనారాయణ, కొత్తల చంద్రశేఖర్, లాయర్ కేవీపీ మాధవరావు, యడ్ల కృష్ణ, మానుకొండ బాబు, కంది రాంబాబు, సామంతుల రామారావు ఉన్నారు.
- 37వ డివిజన్‌లో ఎమ్మెల్యే నాని విజయాన్ని కాంక్షిస్తూ జేసీఎస్ జిల్లా కన్వీనర్ వైఎన్‌వీ శివరావు ఆధ్వర్యంలో సీహెచ్ రామనాగ శంకర్ తదితరులు ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ప్రతి ఇంటికీ మ్యానిఫెస్టోలో హామీలను అమలు చేసి చూపిందని తెలిపారు.
- 12వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ కాపా రఘు ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి కుటుంబానికి మేలు చేసిన సీఎం జగనన్నకు మరోసారి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు బండ్లమూడి సునీల్ తదితరులు ఉన్నారు.
- 43వ డివిజన్‌లో కార్పొరేటర్ జనపరెడ్డి కనకరాజేశ్వరి, పార్టీ నాయకులు జనపరెడ్డి కృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలకు సంక్షేమం కావాలంటే వైఎస్సార్ సీపీ విజయానికి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పితాని గంగాధరరావు, భావిశెట్టి కేశవ, సిరిగిబత్తిన శ్రీధర్, ముత్యం, పల్లెల సత్యనారాయణ, రిజ్వాన్, నీరుకొండ అనంత ఉన్నారు.
- 20వ డివిజన్‌లో కార్పొరేటర్ గూడూరి ఆదిలక్ష్మి, పార్టీ నాయకులు గూడూరి విజయప్రసాద్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామకృష్ణాపురం ప్రాంతంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు.
- 13వ డివిజన్‌లో కార్పొరేటర్ నిడికొండ అన్నపూర్ణ, పార్టీ యువజన నగర అధ్యక్షుడు నిడికొండ నరేంద్ర ఆధ్వర్యంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే నానికి అండగా నిలవాలని, సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు.
- 30వ డివిజన్‌లో డీమార్ట్ సెంటర్ ఆంజనేయ స్వామి గుడి రోడ్డు నుంచి చిన్న శివాలయం రోడ్డు, తెలగల పేట, రామాలయం, పత్తేబాద మెయిన్ రోడ్డు, కుర్మావారి వీధి, బూసం వారి వీధుల్లో ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్ సీపీ విజయానికి మద్దతుగా నిలవాలని ప్రజలను కోరారు.
- అవ్వాతాతలకు భరోసాగా జగనన్న ఉంటాడని, మరోసారి ముఖ్యమంత్రిగా పేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులను ఆదుకునేందుకు వైఎస్ జగనన్న విజయం సాధిస్తారని ఏలూరు ఏడో డివిజన్ కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి వృద్ధులకు వివరించారు. చంద్రబాబు గెలిస్తే తామంతా కష్టాలు పడడం ఖాయమని వృద్ధులు ఆందోళన చెందుతోన్న నేపథ్యంలో ఆమె ఇంటింటా ప్రచారం నిర్వహించారు. వృద్ధులను ఆప్యాయంగా పలుకరిస్తూ వారికి సంక్షేమ పథకాలను వివరిస్తూ.. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నానిని గెలిపించాలన్నారు.



12వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న మాజీ కార్పొరేటర్ కాపా రఘు



43వ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు జనపరెడ్డి కృష్ణ



రామకృష్ణాపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు విజయప్రసాద్



13వ డివిజన్‌లో యువజన అధ్యక్షుడు నిడికొండ నరేంద్ర ప్రచారం



30వ డివిజన్‌లో జోరుగా ఎన్నికల ప్రచారం



వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ పిల్లంగోళ్ల శ్రీదేవి

జగన్‌ను మళ్లీ సీఎం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నత్తా యోనారాజు

ఏలూరు (టూటౌన్): పేదల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంను చేయాలని పీవీ రావు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు నత్తాన యోనా రాజు పిలుపునిచ్చారు. ఏలూరులో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలు బతకాలి, ఉండాలి, తినాలి, అభివృద్ధి చెందాలంటే మళ్లీ వైఎస్ జగన్ అన్న సీఎం అయితేనే సాధ్యమని యోనా రాజు అన్నారు. సంపన్నుల పక్షాన చంద్రబాబు పనిచేస్తున్నారని, దానికి భిన్నంగా పేదవాడి పక్షాన యుద్ధం చేస్తున్న వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు మాలలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. 'రాష్ట్రానికి జగన్ అన్నే కావాలి.. ఎందుకంటే..' అంటూ రూపొందించిన సంక్షేమ పథకాల కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఏలూరు సుధాకర్, నాయకులు గారపాటి నాగేశ్వరరావు, పులవర్తి డేవిడ్, గొటికల అరవింద్, దాసే పండు, కాంద్రు కుమార్, గొల్ల సుధాకర్, కె.రాజేష్, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డీఈఎల్‌ఈడీ పరీక్షలకు 107 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డీఈఎల్‌ఈడీ పరీక్షల్లో భాగంగా శనివారం నిర్వహించిన మూడో సెమిస్టర్ పరీక్షకు 63 మందికి 59, ఒకటో సెమిస్టర్ పరీక్షకు 51 మందికి 48 మంది హాజరయ్యారని విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు ఏడుగురు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని తెలిపారు.

శ్రీవారి పథకాలకు రూ.3.11 లక్షల విరాళం



దాత జ్యోత్స్నరాణికి విరాళం బాండ్ పత్రం అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానంలోని నిత్యాన్నదానం, విమానగోపుర స్వర్ణమయ పథకాలకు ముగ్గురు భక్తులు శనివారం వేరువేరుగా రూ.3,11,346 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా గుడివాడకు చెందిన పల్లగాని వెంకటేష్ నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116, ఏలూరుకు చెందిన పట్నాల జ్యోత్స్నా రాణి నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116, అనంతపురానికి చెందిన పుచ్చగింజల సాయికుమార్ విమానగోపుర స్వర్ణమయ పథకానికి రూ. 1,11,114 విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, సూపరింటెండెంట్‌లు రమణరాజు, డీవీఎస్ రాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు. అనంతరం దాత కుటుంబాలకు స్వామివారి ప్రత్యేక దర్శన భాగ్యాన్ని కల్పించారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

ఏలూరు (టూటౌన్): ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే కార్యక్రమాన్ని ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి శ్రీనివాస డాంగే, కంకిపాటి బుచ్చిబాబు, ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావులు పిలుపు నిచ్చారు. స్థానిక స్ఫూర్తి భవన్‌లో శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ ఎన్నికల కమిషనర్ మేడే నిర్వహణకు అనుమతిచ్చారని తెలిపారు. మే 1న ఆయా కార్యాలయాల వద్ద ఏఐటీయూసీ పతాకాలను ఆవిష్కరించి, సభలు నిర్వహించాలన్నారు.